శుభాకాంక్షలు..

కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీ గణేష్ తన రాజకీయ గురువు, మాజీ మంత్రి జే. గీతారెడ్డిని గురువారం మారేడ్‌పల్లిలోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం గీతా రెడ్డికి పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని గీతారెడ్డి గణేష్‌ను ఆశీర్వదించారు. – మారేడ్‌పల్లి

వాసవీ సేవ ఆధ్వర్యంలో..అన్నదానం

అమావాస్యను పురస్కరించుకొని కంటోన్మెంట్ ఐదో వార్డు వాసవీనగర్‌లో గురువారం వాసవీ సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు. ప్రతి అమావాస్య సందర్భంగా వాసవీ సేవ సమితి ఆధ్వర్యంలో అన్నదాన్నం నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తేలుకుంట సతీష్ గుప్తా, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు. – మారేడ్‌పల్లి

న్యూ బోయిన్‌పల్లిలో..

అమావాస్యను పురస్కరించుకొని గురువారం న్యూ బోయిన్‌పల్లి బాపూజీ నగర్,దేవి నల్లపోచమ్మ,జయ నగర్ నల్లపోచమ్మ,కట్టమైసమ్మ ఆలయాల్లో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదానం నిర్వహించారు. – కంటోన్మెంట్

ఎక్కడపడితే అక్కడే చెత్త

నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాల ముందు రోడ్లపై చిందరవందరగా చెత్త డంపింగ్ రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పారిశుద్ధ్య సిబ్బంది
- అవస్థలు పడుతున్న స్థానికులు
- త్వరగా పరిష్కరించాలని పలువురి వేడుకోలు

బేగంపేట్, జూన్ 6: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో చెత్త సమస్యపై స్థానిక కార్పొరేటర్, శానిటేషన్ అధికారులు దృష్టి సారించడం లేదు. రోడ్లపై చెత్తా చెదారాలు,వ్యర్థాలు పేరుకుపోతున్నా.. మురుగు నీరు రోడ్ల పైకి వస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధ భరితంగా మారుతుంది. డివిజన్‌లోని నల్లగుట్ట ప్రాంతంలో ఈ సమస్య అధికంగా కనిపిస్తుంది. ఈ ప్రాంతం గుండా నిత్యం పదుల సంఖ్యల్లో వాహనదారులు, పాదచారులు వెళ్తుంటారు. ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాల, నల్లగుట్ట మసీదు ఎదురుగా, సికింద్రాబాద్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణ ప్రదేశంలో ఈ సమస్య అధికంగా ఉంది. మరో వారం రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. కానీ సమస్య మాత్రం అలాగే ఉన్నది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర భర్త చీర శ్రీకాంత్.. క్లాత్ మర్చంట్ వ్యాపారి కావడం ఆ భవన నిర్మాణ దారులకే సపోర్ట్‌గా వ్యవహరిస్తుండటంతో శానిటేషన్ అధికారులు, సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

భవన నిర్మాణ సమయంలో క్యూరింగ్ చేసే సమయంలో ఉపయోగించే నీరంతా రోడ్లపైకి వచ్చి ఆ ప్రాంతమంత మురుగునీటి మయంగా మారుతుంది. దీనికి తోడు ఆ ప్రాంతంలోనే చెత్త డంపింగ్ చేస్తున్నారు. క్లాత్ మర్చంట్ భవన ప్రాంతంలో గతంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాంతమంతా ప్రతిరోజూ శుభ్రం చేయించి అక్కడ చెత్త వేయకుండా ముగ్గులు వేయించేవారు. కాని ఇప్పుడు ఆ ప్రాంతంలో చెత్త వేసినా పట్టించుకునే వారే లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సికింద్రాబాద్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ భవన నిర్మాణం ముందు చెత్తగా మారిన ఏరియా

సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లినా..నిర్లక్ష్యమే..!

నూనత భవన నిర్మాణం చేపడుతున్నప్పటి నుంచి భవన నిర్మాణ వ్యర్థాలు, వారు ఉపయోగించే నీరంతా రోడ్లపైకి వస్తుందని రాంగోపాల్‌పేట్ డివిజన్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా సికింద్రాబాద్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం. అయినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదు. భవన నిర్మాణ సమయం నాటి నుంచి వారు ఉపయోగించిన ప్రతిసారి నీరంతా ఇండ్లు, వ్యాపార దుకాణాల ముందు ప్రవహిస్తుంది.

– సత్యనారాయణ, వార్డు మాజీ సభ్యుడు

చెత్త వేయకుండా అవగాహన కల్పిస్తాం

గతంలో నల్లగుట్ట ప్రాంతంలో చెత్త వేయకుండా చూశాం. ప్రస్తుతం ఆ పాంతంలో చెత్త వేస్తున్నట్లు మాకు ఫిర్యాదు అందలేదు. రాత్రిపూట అక్కడ ఫుడ్‌కోర్ట్స్ వారు, ఇతర వ్యాపారస్తులు చెత్త వేస్తున్నట్లు సమాచారం. వారికి త్వరలోనే అక్కడ చెత్త వేయకుండా అవగాహన కల్పిస్తాం.

– శ్రీనివాస్, డిప్యూటీ ఇంజినీర్ బేగంపేట్ సర్కిల్

రోడ్లపైకి వచ్చేదీ డ్రైనేజీ నీరే..

క్లాత్ మర్చంట్ అసోసియేషన్ భవన నిర్మాణంలో ఎలాంటి క్యూరింగ్ వాటర్ రోడ్లపైకి రావడం లేదు. దీని పక్కనే ఉన్న నిర్మాణాల నుంచి వస్తుంది. అక్కడ ప్రవహించే నీరంతా డ్రైనేజీ మురికినీరు. మాకు రాంగోపాల్‌పేట్ డివిజన్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ మురుగు, వ్యర్థాలు, చెత్తపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. అక్కడ చెత్తను రాత్రి పూట ఫుడ్ కోర్ట్స్ వారు, స్థానిక వ్యాపారస్తులు డంపు చేస్తున్నారు. శానిటేషన్ సిబ్బందికి చెప్పి ఆ ప్రాంతమంతా శుభ్రం చేయిస్తాం.

– చీర సుచిత్ర, కార్పొరేటర్

చిన్నపిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించండి

హమాలిబస్తీలో బడిబాట కార్యక్రమం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బన్సీలాల్‌పేట్, జూన్ 6 : పద్మారావునగర్‌లోని హమాలిబస్తీలో గురువారం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ 1, 2 టీచర్లు కుల్సుమ్, జానకిలు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ రెండున్నరేండ్ల నుంచి ఐదేండ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలన్నారు. ప్రతిరోజూ అక్కడ వారికి పూర్వ ప్రాథమిక విద్యతో పాటు ఆహారం అందిస్తామన్నారు. అదేవిధంగా మంచి అలవాట్ల గురించి వివరిస్తామన్నారు. 'అంగన్‌వాడీలలో పిల్లలను చేర్పించండి, చిన్నారులకు బంగారు బాట వేయండి' అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో హమాలిబస్తీ అధ్యక్షుడు సుభాష్, ప్రభుత్వ పాఠశాల టీచర్ శిరీష, ప్లాన్ ఇండియా వలంటీర్ లక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్ భాగ్యమ్మ పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా చూస్తా : సామల హేమ

ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ అన్నారు. డివిజన్ పరిధిలోని సీతారామ్‌నగర్ దేడ్ లాక్ బిల్డింగ్ ప్రాంతంలో మురుగు నీరు ఉప్పొంగుతున్నదని తమకు ప్రతి నిత్యం ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. గురువారం కార్పొరేటర్ సంబంధిత అధికారులతో కలిసి ఆప్రాంతంలో పర్యటించారు. సమస్యలను త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అన్వీత్, తదితరులు పాల్గొన్నారు.

– సికింద్రాబాద్, జూన్ 6

విజేతగా పవర్‌హిట్టర్స్ టీమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అత్తాపూర్‌లోని స్టైయిట్ డ్రైవ్ వేదికగా జరిగిన బాక్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్(బీసీపీఎల్)లో పవర్ హిట్టర్స్ టీమ్ విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్లో పవర్‌హిట్టర్స్..పూర్ బాయ్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత పూర్‌బాయ్స్ 7 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 40 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన పవర్‌హిట్టర్స్ 6.5 ఓవర్లోనే విజయాన్నందుకుంది. సూపర్ బౌలింగ్‌తో ఆకట్టుకున్న శంకర్‌సింగ్ రాజ్‌పుత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ముగింపు కార్యక్రమానికి అజయ్‌కుమార్ అగర్వాల్, అమ్రిత్‌కుమార్, అరుణ్‌కుమార్, వేద్‌ప్రకాశ్ హాజరయ్యారు.

సెయిలింగ్ పోటీలు షురూ..

సిటీబ్యూరో, జూన్ 6(నమస్తే తెలంగాణ)/ హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆర్మీకి చెందిన ఈఎమ్‌ఈ వార్షిక సెయిలింగ్ రెగెట్టా చాంపియన్‌షిప్‌నకు తెరలేచింది. ద క్రాప్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీర్స్ (ఈఎంఈ) సెయిలింగ్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్‌లో సెయిలింగ్ పోటీలను లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్‌నాయ్ ప్రారంభించారు. సెయిలింగ్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రాప్స్ ఆఫ్ ఈఎంఈ సెయిలింగ్ రెగెట్టా – 2024 పోటీల వివరాలను వెల్లడించారు. ఈ టోర్నీలో దేశంలోని వివిధ ఆర్మీ యూనిట్లకు చెందిన సెయిలర్లు పోటీపడుతున్నారు. రెగెట్టా టోర్నీలో రాణిస్తే భవిష్యత్‌లో ఆర్మీ శిక్షణతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో దేశం ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం లభించనున్నట్లు నీరజ్ పేర్కొన్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో.. అన్నదానం

ఆర్యవైశ్య సంఘం వారాసిగూడ ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజున అన్నదానం చేస్తుంటారు. గురువారం వారాసిగూడ చౌరస్తాలో సుమారు 500 మందికి అన్నదానం చేసినట్లు ఆర్య వైశ్య సంఘం నాయకులు తెలిపారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కూరాకుల సుధాకర్, సెక్రటరీ రాజేష్ ,కోశాధికారి వీరశేఖర్ ,మాజీ అధ్యక్షులు బెల్దె నర్సింహారావు, కోట శ్రీనివాసరావు, రాజు పాల్గొన్నారు. – సికింద్రాబాద్

సికింద్రాబాద్‌లో బీజేపీ నాయకుల సంబురాలు

సీతాఫల్‌మండి చౌరస్తాలో సంబురాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్, జూన్ 6 : సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో గంగాపురం కిషన్‌రెడ్డి రెండోసారి ఎంపీగా ఎన్నికైన సందర్భంగా బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు.గురువారం సీతాఫల్‌మండి చౌరస్తాలో పటాకులు కాలుస్తూ స్థానికులకు, కార్యకర్తలకు మిఠాయిలు పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్ గౌడ్ ,పి రవిప్రసాద్ గౌడ్,మేకల సారంగ పాణి,కందాడి నాగేశ్వర్‌రెడ్డి, అంబాల రాజేశ్వర్‌రావు,కనకట్ల అరవింద్ హరి తదితరులు పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్‌లో..

బోయిగూడలో మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

బన్సీలాల్‌పేట్, జూన్ 6 : సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీగా బీజేపీ అభ్యర్థి జీ.కిషన్‌రెడ్డి రెండోసారి విజయం సాధించడం, మూడోసారి మోదీ ప్రధాని కానుండడంతో మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకున్నారు. బోయిగూడలోని ఉప్పలమ్మ దేవాలయం వద్ద జరిగిన సంబురాలలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ టి.రాజశేఖర్ రెడ్డి, నాయకులు ఎస్.రాజు, వై.సురేశ్, కేఎం. కృష్ణ, గణేశ్, సత్యనారాయణ, విద్య, సుచరిత, ఛాయ, బిందు, సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లో అత్యధిక ఓట్లు సాధించిన పోలింగ్ బూత్ అధ్యక్షుడు మహేశ్‌ను నాయకులు సన్మానించారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ

సమావేశంలో మాట్లాడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సంధ్య

బన్సీలాల్‌పేట్, జూన్ 6 : భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బడిబాట సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ' చైర్‌పర్సన్ ఎ.సంధ్య మాట్లాడుతూ.. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి తెలుసుకున్నారు. అలాగే బడిబాట ర్యాలీ, ఇంటింటి సర్వే నిర్వహించి విద్యార్థుల నమోదు పెంచడానికి చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాల గురించి చర్చించారు. పాఠశాల హెచ్ఎం కే.మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిధులతో బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, బాలుర మరుగుదొడ్లకు మరమ్మతులు, తరగతి గదుల్లో విద్యుత్ వైరింగ్, ఇతర మైనర్ రిపేరింగ్ పనులు చేపట్టామని వివరించారు. నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్య, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్, పుస్తకాలు, కంప్యూటర్ శిక్షణ, డిజిటల్ తరగతులు, క్రీడలలో శిక్షణ అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని కోరారు. అనంతరం అందరూ కలిసి బడిబాట ప్రతిజ్ఞ చేశారు.

పాఠశాలలో జరుగుతున్న టాయిలెట్స్ నిర్మాణం

రాంగ్ సైడ్‌డ్రైవింగ్.. నేరం

- టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

అమీర్‌పేట్, జూన్ 6 : యూ టర్న్ దూరంలో ఉందని, రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనదారులు.. చట్టరీత్యా నేరానికి పాల్పడుతుండడమే కాకుండా .. తమతో పాటు ఎదురుగా వస్తుండే వారికి కూడా ప్రమాదాలను తెచ్చిపెడుతున్నారని బేగంపేట్ టీటీఐ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. గురువారం బల్కంపేట లోని చెన్నైస్ అమృత ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో విద్యార్థులు, సంస్థ ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రోడ్లపై సురక్షిత ప్రయాణాల కోసమే వన్ వే, యూటర్న్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ కేసులు 2023లో 5.23 లక్షలకు పైగా నమోదయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ చంద్ర మోహన్, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

శని జయంతి సందర్భంగా..

గురువారం శని జయంతిని పురస్కరించుకుని భక్తులు దేవాలయాల్లో స్వా మి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి స్వామి వారికి జరుగుతున్న విశేష పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమీర్‌పేట్ హనుమాన్ దేవాలయంలో బీజేపీ నేత, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, ఇందిరారెడ్డి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

– అమీర్‌పేట్

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్..



ఈఎస్ఐ కార్డులను అందజేస్తున్న వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహేందర్

సికింద్రాబాద్,జూన్ 6 : ఉస్మానియా యూనివర్సిటీలో సీఐటీయూ పోరాట ఫలితంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యం లభించిందని ఓయూ కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహేందర్ అన్నారు. గురువారం ఓయూలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఓయూలో పనిచేస్తున్న 382 మంది ఔట్ సోర్సింగ్, కార్మికులకు ఆరోగ్య బీమా(ఈఎస్ఐ) కార్డులను కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అందజేశామన్నారు. అదేవిధంగా సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా వారికి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం, నాయకులు, లక్ష్మి, నరమ్మ, వెంకటమ్మ,రాణి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ అడ్డా వద్ద మూత్రశాలలు ఏర్పాటు చేయాలి

తుకారాంగేట్‌వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

అడ్డగుట్ట, జూన్ 6 : తుకారాంగేట్ లేబర్ అడ్డా వద్ద కార్మికుల కోసం మూత్రశాలలు ఏర్పాటు చేయాలని సికింద్రాబాద్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గౌరీ నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం తుకారాంగేట్‌లో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశానికి నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యధిక కార్మికులుండే తుకారాంగేట్ లేబర్ అడ్డా వద్ద వారి అవసరం కోసం మూత్రశాలలు, మంచినీటి వసతిని ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రవి, మల్లేష్, రమేష్, కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తిని రాజకీయం చేయడం సరికాదు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్, భాగ్యశ్రీ

బొల్లారం, జూన్ 6 : కంటోన్మెంట్ ఏడో వార్డు లాల్‌బజార్ శ్రీ మహంకాళి దేవాలయంలో అమావాస్య సందర్భంగా మహంకాళి అమావాస్య కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెల పూజలు నిర్వహిస్తూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తన్నామని బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించే ఏర్పాట్లను కొందరు వ్యక్తులు అడ్డుకోవడం సరికాదన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను రాజకీయం చేయడం బాధాకరమన్నారు. అనంతరం దేవాలయం వెనుక భాగంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు గౌరీ శంకర్, రుక్మయ్య, రాజు, యశ్వంత్ కుమార్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.